క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, వైశాఖ మాసం, హస్త నక్షత్రం, ద్వాదశి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు.. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

వీరాంజనేయస్వామి 70 వార్షికోత్సవం

ఇంకొల్లు (చినగంజాం): పావులూరు పొలిమేర వీరాంజనేయ స్వామి 70వ వార్షికోత్సవ జయంతి మహోత్సవం ఈ నెల 21 నుంచి 23 వతేదీ వరకు నిర్వహించనున్నట్లు పావులూరు హనుమత్పాదదాసులు తెలిపారు. ఇందులో భాగంగా మంగళ, బుధ, గురువారాల్లో ఆంజనేయ స్వామి వారి సన్నిధిలో జరుగు త్రయాహ్నిక జయంత్యుత్సవాలు, సువర్చలా సమేత ఆంజనేయ స్వామి కళ్యాణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

24న మండల సర్వ సభ్య సమావేశం

చినగంజాం: మండల ప్రజా పరిషత్ సర్వ సభ్యసమావేశం ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యూబీ వరప్రసాద్ తెలిపారు. మండల ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశం ఎన్నికల నియమావళికి లోబడి నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్నిశాఖల అధికారులు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



విద్యార్థులతో మాట్లాడుతున్న గ్రంథపాలకుడు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): గ్రంథాలయాలతో ప్రతి ఒక్కరు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సంతమాగులూరు శాఖ లైబ్రేరియన్ బాదం విజయభాస్కరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో 28 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉజ్జీవ సభలు

ఒంగోలు రూరల్: మండలంలోని దేవరంపాడు ఎస్సీకాలనీలో బేతేలు ప్రార్థనా మందిరం ఆవరణలో మూడు రోజులపాటు జరగనున్న ఉజ్జీవ సభలు శనివారం ప్రారంభమయ్యాయి. వైజాగ్‌కు చెందిన రెవరెండ్ విజయ్‌కుమార్ పాల్గొని ప్రార్థనా కూడికల్లో ముఖ్య ప్రసంగం చేశారు. స్థానిక పాస్టర్ అంచెల శేఖర్ ఆధ్వర్యంలో జరుగుతున్న సభలను రిటైర్డ్ హెచ్‌ఎం కుమారి జి.బేబీస్టార్ ప్రార్థన చేసి ప్రారంభించారు. పాస్టర్ సీహెచ్ విక్టర్‌పాల్ నిర్వహించిన ఈ సభల్లో విజయ్‌కుమార్ మాట్లాడుతూ నేటి క్రైస్తవుల్లో నిజమైన భక్తి ఉండాలని పిలుపునిచ్చారు. అలవాటులో భాగంగా ప్రార్థనలు చేయడం, చర్చిలకు వెళ్లడాలు ఆపివేయాలని, దేవుని రాకడ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి హృదయాన్ని దేవుని ఆత్మతో నింపుకోవాలని, శుద్ధ కలిగిన జీవితం అలవరచుకోవాలని కోరారు. ఒంగోలు రూరల్ గ్రామాల్లోని క్రైస్తవులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ మాత జయంత్యుత్సవాలు



చీరాలలో సువర్ణ కిరీటంతో ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి



కారంచేడులో ప్రత్యేక అలంకరణలో మాధవస్వామి వారు



అద్దంకిలో 108 కలశాలతో నీటిని తీసుకొస్తున్న మహిళలు

చీరాల అర్బన్: పట్టణంలోని సంతబజారులో వేంచేసియున్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి జన్మదినోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి జన్మదినోత్సవాల సందర్భంగా ప్రతిరోజు విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. శనివారం ఉదయం విశేష అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి సువర్ణ కిరీటాన్ని అలంకరించారు. అలానే 102 మంది మహిళలచే కుంకుమ పూజలు, హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దేవస్థాన ప్రాంగణంలో 2వేల మందికి సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి నామస్మరణతో దేవాలయ ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమాలను దేవస్థాన అధ్యక్షుడు గుంటూరు మాధవరావు, కార్యదర్శి వలివేటి వరదరాజులు, కోశాధికారి గుగ్గిలం విశ్వేశ్వరరావు, కమిటి సభ్యులు పర్యవేక్షించారు.

అద్దంకిలో 108 కలశాలతో అభిషేకం..

అద్దంకి: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా పట్టణంలోని శ్రీచక్రసహిత వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శనివారం ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. దానిలో భాగంగా అష్టోత్తర కళశ స్థాపన, గణపతి నవగ్రహ, వాసవీ హోమాలను నిర్వహించారు. అమ్మవారికి విశేష ద్రవ్యాలతో అభిషేకం, గుండ్లకమ్మ నది నుంచి 108 మంది ముత్తైదువులతో 108 బిందెలతో నీరు తెచ్చి అభిషేకం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, మహాగణపతి పూజ, శైవ శుద్ధి పుణ్యాహవాచనం. మండపారాధన, పంచామృతాభిషేకం, విశేష ద్రవ్యాలతో అభిషేకం, 102 కలశములతో స్నపన, విశేష అర్చన చేశారు. ఈపూజలను గునుపూడి వనీన్ కుమార్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు కోట శ్రీనివాసకుమార్, కార్య నిర్వాహక అధ్యక్షుడు మారం హనుమంతరావు, కోశాధికారి పువ్వాడ అనంత శివకోటేశ్వరరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఘనంగా మాధవస్వామి దశావతార మహాయజ్ఞం..

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు పెదబాజరు ప్రాంతంలో కొలువైన భూనీశా సమేత ప్రయాగ మాధవ స్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలను కన్నుల పండువగా ప్రారంభించారు. శనివారం వేకువజాము నుంచే ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల సందర్శనార్థం సిద్దం చేశారు. స్వామివారి పవిత్రోత్సవాలను పురస్కరించుకొని మాధవస్వామివారికి సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, భగవత్‌ప్రార్థన, విఖనస మహిర్షి ఆరాధన నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు వేదాంతం కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అర్చక బృందం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ వేణుగోపాలరావు, కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మార్టూరులో...

మార్టూరు: ఆర్యవైశ్యుల కుల దైవం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు శనివారం మార్టూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక బొడ్డురాయి సెంటరులోని వాసవీ మాత ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమ పూజ నిర్వహించారు. చిలుకలూరిపేటకు చెందిన రాంలక్ష్మణ్ క్లాత్ షోరూమ్ వారు బహూకరించిన పట్టుచీర అలంకరణలో అమ్మవారు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఇంకొల్లులో..

ఇంకొల్లు (చినగంజాం): వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కృష్ణానగర్‌లో కృష్ణమందిరం నందు వాసవీ మాతకు మహిళా భక్తులు ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మందిరం నందు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. శనివారం రాత్రి అమ్మవారికి కుంకుమ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజేటి మల్లిఖార్జునరావు, మాజేటి సత్యనారాయమ, ముప్వల రాజేంద్రప్రసాద్, మాదాల బాల శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

చినగంజాంలో..

మండల కేంద్రం చినగంజాం వాసవీ కన్యక పరమేశ్వరి మందిరంలో వాసవీ మాత జయంతిని పురస్కరించుకొని శనివారం ఉదయం మహిళా భక్తులు అమ్మవారికి కలశాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మ వారి చిత్రపటంతో 108 బిందెలతో జలాన్ని తీసుకొనివచ్చి అమ్మవారిని అభిషేకించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పొట్టి రమేష్, శైలజ దంపతులు అమ్మవారికి కుంకుమ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం రాత్రి విష్ణుసహస్ర పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అమ్మవారిని పల్లకిలో నగరోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.



అద్దంకి: పుష్పాలంకరణలో అమ్మవారు



కారంచేడులో హోమాలు నిర్వహిస్తున్న రుత్విక్కులు



మార్టూరులో పూజలు చేస్తున్న మహిళలు చేస్తున్న మహిళలు



చినగంజాంలో 108 కలశాలతో నీటిని తీసుకెళ్తున్న మహిళా భక్తులు



ఇంకొల్లులో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్న మహిళలు

విద్యార్థినికి సైకిల్ అందజేత



లియోరాకు సైకిల్ అందజేస్తున్న దాత అనిల్‌కుమార్

చీరాల రూరల్: పేద విద్యార్థినికి దాత సైకిల్ అందించారు. పద్మ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం పేరాలలోని శృంగారపేటకు చెందిన ఏడో తరగతి చదువుతున్న పేద విద్యార్థిని పేర్లి లియోరాకు ఆమె ఇంటివద్ద కుటుంబ సభ్యుల సమక్షంలో రూ.6,500 విలువ కలిగిన సైకిల్ అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల విద్యార్థిని తండ్రి మృతి చెందాడని చెప్పారు. కుటుంబ భారం విద్యార్థిని, తల్లిమీద పడడంతో రోజువారి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటుందన్నారు. అయితే విద్యార్థిని స్కూలుకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కొందరు తన దృష్టికి తీసుకురావడంతో చదువుకు ఆటంకం కలగకూడదని చిరుసాయం చేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎడ్ల ప్రసాద్, వనమ జయకుమార్, గొట్టిపాటి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

104 శిబిరాలతో రోగులకు మేలు



సోమవరప్పాడులో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: ప్రభుత్వం వైద్య వసతి లేని మారుమూల గ్రామాలకు 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి రమీజ్ అహ్మద్ అన్నారు. శనివారం ఉప్పుమాగులూరు-2 సచివాలయ పరిధిలోని సోమవరప్పాడు, కోటావారిపాలెం గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరంలో భాగంగా వృద్ధులు బాలింతలు, చిన్నారులకు గర్భిణులకు వివిధ రకాల పరీక్షలతో మందులు పంపిణీ చేశారు. వర్షాలు కురుస్తున్నందున ప్రజలు తగు జాగ్రత్తలతో ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారి సూచించారు. ఈ శిబిరంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత డ్రాయింగ్ మాస్టర్ 'కూరపాటి' మృతి



కూరపాటి వెంకట్రావు

చీరాల అర్బన్: విశ్రాంత డ్రాయింగ్ టీచర్, కల్పనా ఆర్ట్స్ అధినేత కూరపాటి వెంకట్రావు శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. డ్రాయింగ్ టీచర్‌గా పనిచేసిన ఆయన ఇటీవల పదవీవిరమణ చేశారు. స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన డ్రాయింగ్ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ప్రస్తుతం వేసవి శిక్షణలో భాగంగా ఆయన చిన్నారులకు డ్రాయింగ్ క్లాసులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి గుండెపోటు రావడంతో మృతిచెందారు. కల్పన ఆర్ట్స్ ద్వారా చిత్రకళలో ఎందరికో స్ఫూర్తినిచ్చి ఎందరినో తన శిష్యులుగా తీర్చిదిద్ది వారి భవిష్యత్‌కు బాటలు వేశారు. ఆయన మృతి పట్ల చీరాల, పరిసర ప్రాంతాల్లోని చిత్రకారులు కె.నారాయణ, టి.పద్మారావు, జి.రవి, జస్టిస్, త్యాగరాజు, హార్డిన్, శేఖర్, యాకోబు, చంద్ర, రమేష్, నీలాంబ్రం, బాబు, దేవదానం తదితరులు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

చీరాల రూరల్: వ్యవసాయ శాఖ తరపున ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా 50 శాతం రాయితీతో అందించే పచ్చిరొట్ట పైర్ల విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఐ. సుమతి శనివారం తెలిపారు. ఖరీఫ్ 2024 తొలకరి వర్షాలు ఆరంభమైన తరుణంలో రైతులు తమ ఆధార్ కార్డులను పాస్ పుస్తకాలు తమ మొబైల్ తీసుకుని ఆర్బీకేలను సందర్శించినట్లయితే విత్తనాలు పొందవచ్చనని తెలిపారు. జీలుగ 10 కేజీల బ్యాగు రైతు కట్టాల్సిన రుసుము రూ. 440, పిల్లిపెసర 8 కేజీల బ్యాగు రైతు కట్టాల్సిన రుసుము రూ. 536, భూమితో ఈ విత్తనాలు వేసిన 40 రోజులు అనంతరం భూమిని కలియదున్ని భూసారాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. చీరాల మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.





ఈపురుపాలెం - చీరాల రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

వర్షం తెచ్చిన సంతోషాలు..

చీరాల టౌన్: ఎర్రటి ఎండాకాలంలో చల్లటి వర్షం కురుస్తుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రుతుపవనాలు ముందుగా వస్తుండటంతో వర్షాలు ఊపందుకుంటున్నాయి. శనివారం ఉదయం నుంచి కురిసిన వర్షాలకు ఈపురుపాలెం - చీరాల రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిల్వ చేరడంతో ప్రజలు కష్టాలు పడుతున్నారు.

